సాక్షి సిద్దిపేట

బుధవారం, 22, ఫిబ్రవరి, 2023



రహదారిపై డీసీఎం దగ్ధం 8లో..

జీరంగూడ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం డీసీఎం వాహనం దగ్ధమైంది. ఆ మంటలు రోడ్డు పక్కన నిలిపిన కారుకు కూడా అంటుకొని అది కూడా దగ్ధమైంది.



కొడుకులున్నా.. కూడు లేదని 8లో..

రెక్కలు ముక్కలు చేసుకొని ముగ్గురు కొడుకులను పెంచి పెద్దచేసింది. ఆస్తులూ సంపాదించింది. వయసు పైబడిన దశలో ఆ వృద్ధ తల్లి ఆకలితో అలమటిస్తోంది.



ఘనంగా మాతృభాషా దినోత్సవం

తల్లి లాంటి తెలుగు భాషను మరిస్తే అమ్మను మరచినట్లేనని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. 9లో..

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేటకమాన్: సిద్దిపేట భరోసా సెంటర్‌లో కాంట్రాక్ట్ పద్ధతిన సపోర్ట్ పర్సన్‌గా పనిచేయడానికి అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీపీ శ్వేత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగానికి మాస్టర్ ఆఫ్ సోషల్ వర్క్ విద్యార్హతతో పాటు రెండు సంవత్సరాల పని అనుభవం ఉండాలన్నారు. 25 నుంచి 35 ఏళ్ల వయసు గల మహిళ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి, విద్యార్హతలు ఉన్న వారు 28వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు విద్యార్హత ధ్రువపత్రాలు, బయోడేటా వివరాలతో సిద్దిపేట వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలోని మహిళా పోలీసు స్టేషన్ సీఐ దుర్గకు అందజేయాలన్నారు. సందేహాలు ఉంటే 9440795364 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'నిర్వాసితులకు అన్ని వసతులు కల్పిస్తాం'



మంత్రి హరీశ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టు పరిధిలోని అక్కన్నపేట మండలంలోని ఆరు గిరిజన తండాల భూ నిర్వాసితుల సమస్యలను పరిష్కరించాలని వారితో కలిసి హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మంత్రి హరీశ్‌రావుకు విన్నవించారు. ఈ మేరకు మంగళవారం సిద్దిపేటలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వాసితులతో కలిసి సమస్యలు, డిమాండ్లను మంత్రికి వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సానుకూలంగా స్పందించి త్వరలోనే నిర్వాసితులకు కావాల్సిన అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామన్నారు. అలాగే వారి డిమాండ్లను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ప్రాజెక్టును వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

రైతు సంక్షేమమే బీజేపీ ధ్యేయం



మాట్లాడుతున్న శ్రీకాంత్ రెడ్డి

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతు సంక్షేమమే బీజేపీ ధ్యేయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గంగాపూర్, విఠలాపూర్ గ్రామాల్లో నిర్వహించిన స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల సబ్సిడీ తొలగిస్తుందన్నారు. రైతు బంధు ఒక్కటి ఇచ్చి సర్వరోగ నివారిణిగా ప్రచారం చేస్తుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రతి గడపకు చేరేలా శక్తి కేంద్రాలు కృషి చేయాలన్నారు. సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా ప్రజలను మాయ మాటలతో మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అన్ని రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పిట్ల పరుశరాములు, నాయకులు రాజిరెడ్డి, రమేష్, కార్తీక్ రెడ్డి, సురేష్, విజేందర్ రెడ్డి, రాజు, శివరాం గౌడ్, నాగరాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కుక్కల బెడద నుంచి రక్షించండి




వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలో కుక్కల బెడద నుంచి ప్రజలను కాపాడాలని కాంగ్రెస్ ఆధ్వర్యంలో మున్సిపల్ అధికారులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఆధ్వర్యంలో నాయకులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సతీశ్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. రాత్రి సమయాల్లో రోడ్లపై కుక్కలు గుంపులుగా వెళ్లి ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయని వివరించారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా రథోత్సవం

ఝరాసంగం(జహీరాబాద్): కేతకి సంగమేశ్వర ఆలయ ఆవరణలో స్వామి వారి విమాన రథోత్సవం భక్తుల శివనామస్మరణల మధ్య వైభవంగా సాగింది. సోమవారం రాత్రి ఎమ్మెల్యే మాణిక్‌రావు, ఆలయ చైర్మన్ ఎస్.వెంకటేశం, ఈఓ శశిధర్ ప్రత్యేక పూజలు చేసి తాడు లాగి ప్రారంభించారు. రథోత్సవం పూర్వయ్యాక పల్లకీ సేవా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జగదీశ్వర్, ఎంపీటీసీ రజనిప్రియ సంతోష్‌కుమార్‌పటేల్, జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశ్, ఎస్ఐలు రాజేందర్‌రెడ్డి, ఏడుకొండలు, వినయ్‌కుమార్, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఈ-హుండీ.. ఎప్పుడండి?



రాజగోపురం ఎదుట భక్తుల కోలాహలం(ఫైల్)



కొమురవెల్లిలో కానరాని డిజిటల్ సేవలు

- ప్రతీ ఏడాది 33 కోట్ల రూపాయలకు పైగా ఆదాయం
- స్వైపింగ్ మిషన్ ఉన్నా వినియోగించని ఆలయ అధికారులు
- ఈ- హుండీతో పెరగనున్న ఆదాయం

సాక్షి, సిద్దిపేట: మారుతున్న కాలానుగుణంగా భక్తుల సౌకర్యార్థం చిన్న చిన్న దేవాలయాల్లోనూ డిజిటల్ సేవలను అందిస్తున్నారు. కానీ ఏడాది పొడవునా జాతర సాగుతూ దాదాపుగా రూ.33 కోట్లకు పైగా ఆదాయం వచ్చే కొమురవెల్లి మల్లన్న సన్నిధిలో మాత్రం ఈ రకమైన సేవలు కనిపించడం లేదు. కాగా ఇప్పటికే హుస్నాబాద్ సమీపంలో పొట్లపల్లి స్వయంభూ రాజేశ్వరస్వామి ఆలయం, రెండేళ్లకు ఒకసారి జరిగే సమ్మక్క - సారలమ్మ జాతరలోనూ ఈ -హుండీ విధానం అమల్లో ఉంది. కొమురవెల్లిలోనూ డిజిటల్ సేవలు అందుబాటులో తీసుకవస్తే ఆదాయం పెరిగే అవకాశం ఉంది.

రెండు వారాల్లోనే..

- ఏడాదిలో మూడు నెలపాటు కొమురెల్లి జాతర జరుగుతుంది. ప్రతీ ఆది, బుధవారాల్లో రోజుకు సుమారు 50 వేలకుపైగా భక్తులు స్వామివారిని దర్శించుకుంటారు. పట్నం వేసి బోనం మొక్కులు చెల్లిస్తారు. ఆలయంలో మొతం 23 హుండీలున్నాయి. జాతర సమయంలో రెండు నుంచి మూడు వారాల్లో అవి పూర్తిగా నిండుతాయి. సాధారణ సమయాల్లో రెండు నుంచి మూడు నెలల్లో నిండుతుంటాయి. ఆ సొమ్మును ఆలయ సిబ్బంది, వలంటీర్లు లెక్కిస్తారు.
- స్వామి వారి దర్శనాలు, పట్నాలు, బోనాలు, కల్యాణం, ప్రత్యేక దర్శనం, విశిష్ట దర్శనం, తలనీలాలు ఇలా ప్రతీది ఇక్కడ నగదు రూపంలోనే చెల్లించాల్సి ఉంటుంది.
- దేశవ్యాప్తంగా ప్రతి చిన్న షాప్‌లోనూ నేడు డిజిటల్ లావాదేవిలను అందుబాటులో ఉంచుతున్నారు. అలాంటిది మల్లన్న ఆలయంలో మాత్రం అమలు కాకపోవడం గమనార్హం.
- ఇప్పటికీ టికెట్ల ముద్రణ అంతా పాత పద్ధతిలోనే జరుగుతోంది. వాటిపై భద్రతా పరమైన త్రీడీ హోలోగ్రామ్‌లు పెట్టడం స్కానింగ్ చేయడం వంటివి లేవు.
- కంప్యూటరైజ్డ్ బిల్లులు అమలు చేయాలని భక్తులు కోరుతున్నారు. ముడుపులు చెల్లించుకోవడం మినహాయిస్తే మిగితా అంతా డిజిటల్ చెల్లింపులకు అవకాశం ఉంది.
- టికెట్లు జారీ చేయడం, వాటి ద్వారా వచ్చే డబ్బులను తిరిగి ఆలయానికి చెల్లించడంలో గతంలో అవకతవకలు జరిగినట్లు సమాచారం. అలాగే బుకింగ్ కౌంటర్‌లో పట్నాలకు సంబంధించిన బుక్స్ సైతం మయమైనట్లు సమాచారం. ఈ-హుండీ విధానం అమలులోకి వస్తే లావాదేవీలన్నీ పారదర్శకంగా మారే అవకాశం ఉంటుంది.

ఎక్కడి నుంచైనా సేవలు..

- డిజిటల్ చెల్లింపులు, ఈ - హుండీ అమలుతో భక్తులు ఎక్కడి నుంచైనా కానుకలను సమర్పించవచ్చు. దర్శనానికి వచ్చే భక్తులందరికీ దీని గురించి తెలిసేలా ఆలయానికి వచ్చే ప్రధాన మార్గాలు, క్యూ లైన్‌లు, వసతి గదుల వద్ద క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శించాలి.
- భక్తులు సమర్పించే కానుకలు సరాసరి స్వామి వారి బ్యాంక్ ఖాతాలోకి వెళ్తాయి. హుండీ లెక్కింపులకు వలంటీర్లు, ఆలయ ఉద్యోగులు రప్పించే బాధలు చాలా వరకు తీరతాయి.
- రోజుల తరబడి నిల్వ చేయడంతో హుండీల్లో డబ్బులు పసుపు మయం అవుతున్నాయి. అలాగే కొత్తగా వచ్చిన రూపాయి, రెండు రూపాయల నాణేలు ఒకే విధంగా ఉండటంతో వాటిని గుర్తించడంలో లెక్కింపు సమయంలో తీకమక పడుతున్నారు. రూపాయి వేసే దానిలో రెండు రూపాయల కాయిన్‌లను వేసి తూకం వేసి ఇస్తున్నారు.

బార్ కోడ్ తీసుకున్నాం

దేవాలయానికి సంబంధించిన బ్యాంక్ అకౌంట్ బార్‌కోడ్‌ను ఇటీవలనే తీసుకున్నాం. త్వరలో కౌంటర్ల దగ్గర అందుబాటులోకి తీసుకువస్తాం. ఈ-హుండీని సైతం త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. స్వైపింగ్ మిషన్ ఇప్పటికే బ్యాంక్ నుంచి తీసుకున్నాం. -బాలాజీ, ఈఓ



రింగ్ మెయిన్ పైప్‌లైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటకు జల మణిహారం

- నాలుగు దశాబ్దాలకు సరిపడేలా ప్రణాళిక
- నిర్మాణ పనులకు మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన

సిద్దిపేటజోన్: సిద్దిపేట ప్రజల భవిష్యత్ అవసరాలకు సరిపడేలా నాలుగు దశాబ్దాల అంచనాల మేరకు జల భాండాగారం నిర్మించనున్నట్లు ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు అన్నారు. మంగళవారం సిద్దిపేట పట్టణంలోని కాళ్లకుంట కాలనీలో మిషన్ భగీరథ సిద్దిపేట రింగ్ మెయిన్ పైపులైన్ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. ఇది సిద్దిపేటకు జల మణిహారంగా ఉంటుందన్నారు. పట్టణం చుట్టూ 18 కిలోమీటర్లు పొడవునా రూ.32 కోట్లతో దీన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. లోయర్ మానేరు డ్యామ్, మిషన్ భగీరథ, మల్లన్న సాగర్ ద్వారా శాశ్వతంగా తాగునీరు అందించే గొప్ప ప్రణాళికగా ఆయన అభివర్ణించారు. 2,060వ సంవత్సరం వరకు సరిపోయేలా అంచనాలు వేసి ఈ రింగ్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే జూన్‌లో వెయ్యి పడకల ఆస్పత్రి అందుబాటులోకి రానుందన్నారు. జిల్లాలో ప్రారంభించిన రుతుప్రేమ కార్యక్రమం విజయవంతానికి ప్రతీ ఒక్కరూ పనిచేయాలని మంత్రి హరీశ్‌రావు సూచించారు. స్థానిక విపంచి ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కవులు, కళాకారులు, గాయకులు, డ్యాన్సర్లు, చిత్రకారులు, క్రీడాకారులకు రుతుప్రేమ గూర్చి ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్రజారోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. రుతుప్రేమ కోసం కేరళ ప్రభుత్వం రూ.7 కోట్లు బడ్జెట్‌లో పెట్టిందని, కానీ దేశంలో తెలంగాణలో సిద్దిపేట జిల్లాలో మొదటగా క్షేత్ర స్థాయిలో అమలు చేస్తున్న విషయాన్ని మంత్రి వివరించారు. పర్యావరణ హితమైన రుతుప్రేమ గూర్చి అంతటా చర్చ జరగాలన్నారు. మంత్రి వెంటకలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జెడ్పీ చైర్మన్ రోజాశర్మ, మున్సిపల్ చైర్మన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్మన్ విజిత వేణుగోపాల్‌రెడ్డి, రాంచందర్‌రావు, కనకరాజు, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మంచి ఫలితాలు సాధిస్తే సర్‌ప్రైజ్ గిఫ్ట్

- 10 జీపీఏ వచ్చిన వారికి రూ.10 వేల నగదు



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తే సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇస్తానని మంత్రి హరీశ్‌రావు ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు చెప్పారు. మంగళవారం పాఠశాలలో విద్యార్థులకు ఇఫ్లూ(యూనివర్సిటీ) ఆధ్వర్యంలో ఇంగ్లిష్ ఫారీన్ లాంగ్వేజ్ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఆయన మాటల్లోనే.. 'మిమ్మల్ని చదివించమని నేను ఉత్తరం పంపాను.. మీ అమ్మానాన్న లకు చూపించారా..' అని అడిగారు. మరీ రోజూ చదవిస్తున్నారా అని ప్రశ్నించారు. స్కూల్‌లోనే కాదు ఇంటికి వెళ్లి కూడా క్లాసలు వినేలా డిజిటల్ కంటెంట్ బుక్స్ పంపించామన్నారు. ఈ కంటెంట్ ఎలా ఉంది? దీన్ని సద్వినియోగం చేసుకుంటున్నరా? డిజిటల్ కంటెంట్ బాగుందా? అంటూ విద్యార్థులను మంత్రి అడిగారు. దీంతో విద్యార్థులు నవ్వుతూ చాలా బాగుంది సర్ అన్నారు. ప్రతి రోజు రాత్రి 8:30 నుంచి 10 వరకు డిజిటల్ కంటెంట్ చదువుతూ మాకు ఉన్న డౌట్స్ క్లియర్ చెసుకుంటున్నామని వరు తెలిపారు. ఇందుకు మంత్రి సంతోషం వ్యక్తం చేస్తూ పది ఫలితాల్లో 10 జీపీఏ సాధించాలని ఈ సందర్భంగా ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థుల చెప్పే సమాధానం వారి పట్టుదలను చూసి మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో విద్యార్థులు వందశాత ఉత్తీర్ణత సాధించాలన్నారు. 10 జీపీఏ సాధించిన ప్రతి విద్యార్థికి రూ.10 వేలు నగదు పురస్కారాన్ని ఇస్తానని చెప్పారు. 100% ఉత్తీర్ణత సాధిస్తే సర్‌ప్రైజ్ గిఫ్ట్ ఇస్తానని మరోసారి మంత్రి చెప్పారు. కార్యక్రమంలో ఇఫ్లూ వీసీ ప్రొఫెసర్ సురేశ్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్, రాజనర్సు, పాలసాయిరాం, అలకుంట కవిత, అలకుంట మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

సిద్దిపేటకమాన్: డిప్లొమా ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈడీ) మొదటి సంవత్సరం పరీక్షలు జరగనున్న సిద్దిపేట ప్రభుత్వ బాలుర హైస్కూల్ కేంద్రం వద్ద రేపటి నుంచి 28వ తేదీ వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందని సీపీ శ్వేత మంగళవారం తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అమల్లో ఉంటుందన్నారు. పరీక్షా కేంద్రం సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని, 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడి ఉండవద్దని సూచించారు. పరీక్షలకు భద్రతా ఏర్పాట్లు చేశామని, పోలీసు అధికారులు పరీక్షా సమయంలో పెట్రోలింగ్ చేయడం జరుగుతుందన్నారు.

అథ్లెటిక్స్ క్రీడాకారుల ఎంపిక



ఎంపికైన క్రీడాకారులు

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ అటానమస్ కళాశాల మైదానంలో మంగళవారం జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్వర్యంలో ఎంపిక పోటీలను నిర్వహించారు. జిల్లా యువజన క్రీడల అధికారి నాగేందర్, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి రామేశ్వర్‌రెడ్డి ఈ పోటీలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ల వెంకటస్వామిగౌడ్ మాట్లాడుతూ అండర్ 18 విభాగంలో జిల్లా నుంచి 120 మంది క్రీడాకారులు పరుగు పందెం, త్రోస్, జంప్స్ తదితర క్రీడల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొన్నారన్నారు. వీరిలో ప్రతిభ కనబర్చిన 14 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ నెల 25 నుంచి హన్మకొండలో జరగనున్న రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో వీరు పాల్గొననున్నారు. కార్యక్రమంలో మాజీ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ పాతూరి సుజాత, ఆయా క్రీడా సంఘాల బాధ్యులు శ్రీనివాస్, ఉప్పలయ్య, కృష్ణకుమార్, నిశాంక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మా గోస ప్రభుత్వానికి పట్టదా?



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

అక్కన్నపేట(హుస్నాబాద్): 'భూ నిర్వాసితుల త్యాగాలు వెలకట్టలేమని ప్రగల్భాలు పలుకుతున్న ఈ ప్రభుత్వానికి మూడు నెలలుగా పెళ్లయిన యువతులు చేస్తున్న ఆందోళన కనిపించడం లేదా..'? అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. అక్కన్నపేట మండలం గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న భూ నిర్వాసితుల ఆడబిడ్డలు గుడాటిపల్లి గ్రామం వద్ద దీక్ష శిబిరంలో మంగళవారం సత్తెం ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ పునరావాస ప్యాకేజీ వచ్చేంతా వరకు ఈ పోరాటం ఆగదని స్పష్టం చేశారు. మేము ఇక్కడే పుట్టామని, పెళ్లవడమే పాపమా? అని వాళ్లు ఆందోళన వ్యక్తం చేశారు. 18ఏళ్లు నిండిన వారికి ఆర్అండ్ఆర్ ప్యాకేజ్ ఇస్తామని జాబితాను తయారు చేసి పెళ్లి చేసుకున్నారని జాబితా నుంచి తొలగించడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు.

చౌటపల్లివాసికి జాతీయ అవార్డు



ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

హుస్నాబాద్: అక్కన్నపేట మండలం చౌటపల్లికి చెందిన ఇప్పకాయల వెంకటేశంను కళారత్న జాతీయ అవార్డుకు ఎంపిక చేసినట్లు బహుజన సాహిత్య అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ మంగళవారం తెలిపారు. హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వెంకటేశంకు ఎంపిక పత్రాన్ని అందజేశాడు. రాధాకృష్ణ మాట్లాడుతూ వెంకటేశం 22 ఏళ్లుగా విగ్రహాలు తయారు చేస్తూ తన కళా నైపుణ్యాన్ని ప్రదర్శిస్తున్నాడన్నారు. అనేక గ్రామాల్లో అందుబాటు ధరలో దేవాలయాలు నిర్మించి విగ్రహాలు తయారు చేసి విశిష్ట సేవలు అందిస్తున్నారని అన్నారు. మార్చి 12న తిరుపతిలో జరిగే దక్షిణ భారత బహుజన రచయితల సదస్సులో ఈ అవార్డు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమంలో అకాడమీ రాష్ట్ర అధ్యక్షుడు ఎంఎం గౌతమ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు ముక్కెర సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సిద్ధార్థ ప్రతిభ



ప్రశంస పత్రం అందుకుంటున్న సిద్ధార్థ

మిరుదొడ్డి(దుబ్బాక): మంచిర్యాలలో ఇటీవల నిర్వహించిన 41వ సబ్ జూనియర్ జాతీయ బాల్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ పోటీల్లో మిరుదొడ్డి మోడల్ స్కూల్‌కు చెందిన విద్యార్థి వేముల సిద్ధార్థ ప్రతిభను చాటాడు. జాతీయ స్థాయిలో తెలంగాణ జట్టు నాలుగో స్థానంలో నిలిచింది. రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ శ్రీనివాసరావు చేతుల మీదుగా సిద్ధార్థ ప్రశంస పత్రాన్ని అందుకున్నాడు. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి తెలంగాణ జట్టులో ఆడి జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకున్న సిద్ధార్థను రాష్ట్ర బాల్ బ్యాడ్మింటన్ చీఫ్ ప్యాట్రన్స్ మనోహర్‌రావు, శ్రీనివాసరావు, మెదక్ ఉమ్మడి జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ గొట్టం భైరయ్య, అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పీవీ రమణ అభినందించారు. జాతీయ స్థాయి క్రీడల్లో సిద్ధార్థ ప్రశంసలు పొందడంపై మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ భారతీదేవితో పాటు ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

కొత్తగా మూడు జాగిలాలు

- పోలీస్ కమిషనరేట్ భద్రతా విభాగంలోకి చేరిక..
- జర్మనీ షఫర్డ్ 'కాలా', ల్యాబ్ జాతి 'బిట్టు', 'టైసన్'



పోలీస్ కమిషనర్ శ్వేతకు గౌరవ వందనం చేస్తున్న జాగిలాలు

సిద్దిపేటకమాన్: పోలీస్ కమిషనరేట్ భద్రతా విభాగంలోకి శిక్షణ ముగించుకుని నూతనంగా మూడు జాగిలాలు(డాగ్స్) మంగళవారం చేరాయి. జిల్లాలో వీఐపీల పర్యటన సమయంలో భద్రతకోసం హత్యలు, దోపిడీలు జరిగినపుడు నేరస్తులను పట్టుకోవడానికి ఈ జాగిలాలు సహాయపడనున్నాయి. జర్మనీ షఫర్డ్ జాతికి చెందిన కాలా, ల్యాబ్ జాతికి చెందిన బిట్టు, టైసన్ ఈ మూడు జాగిలాలు, హ్యాండ్లర్‌తో సహా కమిషనర్ శ్వేత ముందు హాజరు పరిచారు. ఈ సందర్భంగా జాగిలాలు సీపీకి గౌరవ వందనం చేశాయి. కమిషనరేట్ ఏఆర్ హెడ్ క్వార్టర్‌లో ఇటీవలే ఒక జాగిలం అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. హైదరాబాద్‌లోని మొయినాబాద్ ట్రైనింగ్ సెంటర్‌లో 22వ బ్యాచ్‌లో ఈ డాగ్స్ శిక్షణ పొందాయి.

ఎనిమిది నెలల ట్రైనింగ్

'కాలా'(మగ) పది నెలల వయసు గల జాగిలం కాలా జర్మన్ షెఫర్డ్ జాతికి చెందినది. హత్యలు, దోపిడీలు జరిగినపుడు నేరస్తులను గుర్తుపట్టేలా శిక్షణ పొందినది. ఇది అత్యంత చురుకుగా వ్యవహరిస్తుంది. 'బిట్టు'(మగ), 'టైసన్' ఒక సంవత్సరం వయస్సు ఉన్న ల్యాబ్ జాతికి చెందిన జాగిలాలు. ఇవి 8 నెలల పాటు శిక్షణ పూర్తి చేసుకొని 17వ తేదీన పాసింగ్ ఔట్ పరేడ్ ముగించుకుని సిద్దిపేట పోలీసు కమిషనరేట్ భద్రతా విభాగానికి చేరుకున్నాయి. పేలుడు పదార్థాలను గుర్తుపట్టడంలో ఇవి కీలకంగా వ్యవహరించనున్నాయి. వీటిని జాగ్రత్తగా చూసుకోవాలని హ్యాండ్లర్లకు సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్, ఏఆర్ అడిషనల్ డీసీపీ రామచంద్రరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రఘుపతిరెడ్డి, హ్యాండ్లర్లు శ్రీకాంత్, శంకర్, శ్యామ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొండచిలువ సంచారం
ఆందోళనలో గ్రామస్తులు



కొండచిలువ చుట్టడంతో మృతి చెందిన గొర్రె

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని సికింద్లాపూర్ శివారులో కొండ చిలువ సంచరిస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గ్రామానికి చెందిన రైతు మల్లయ్య తన గొర్రెలను రోజుమాదిరిగానే మంగళవారం అడవికి తీసుకెళ్లాడు. మేత మేస్తున్న క్రమంలో కొండచిలువ గొర్రెని చుట్టి ఊపిరాడకుండా చేసి చంపేసింది. ఇది గమనించిన రైతు స్థానికులకు సమాచారం అందించాడు. కొండచిలువ ఎప్పుడు విరుచుకుపడుతుందోనని స్థానికులు భయపడుతున్నారు.

31మంది మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి కోర్టు జరిమానా విధించింది. ఈ సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...ఆది, సోమవారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 31 మంది పట్టుబడ్డారు. వారిని మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపరచగా జడ్జి 28 మందికి రూ.2 వేల చొప్పున జరిమానా విధించారు. ఒకరికి రూ.3 వేలు, మరో ఇద్దరికి రూ.5 వేలు విధించినట్లు పోలీసులు తెలిపారు.

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి మంగళవారం జరిమానా విధించారు. సిద్దిపేట పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ చౌరస్తా, నర్సాపూర్ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన వాహనాల తనిఖీల్లో వాహనదారులను బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించగా 15 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపరచగా విచారణ చేసిన సిద్దిపేట ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి రమేశ్‌బాబు వారికి రూ.25,500 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ.. మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని సూచించారు.

వేర్వేరు కేసుల్లో నలుగురికి జైలు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలో గతంలో చోటుచేసుకున్న రెండు వేర్వేరు సంఘటనలకు సంబంధించి నలుగురికి ఆరునెలల జైలుశిక్ష పడిందని ఎస్‌ఐ సందీప్‌రెడ్డి తెలిపారు. మనోహరాబాద్, జీడిపల్లిలో అక్టోబర్ 2022 నెలలో జరిగిన రెండు బైకుల చోరీకి సంబంధించి జంగం ప్రశాంత్‌గౌడ్, షేక్ ఫయాజ్, చాపల సంజీవ్‌లతో పాటు మనోహరాబాద్‌కు చెందిన ఓ మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించినందుకు మేడ్చల్ కు చెందిన పంబాల శేఖర్‌కు ఆరునెలల జైలుశిక్ష విధిస్తూ మెదక్ కోర్టు జడ్జి రీటా లాల్‌చంద్ తీర్పు వెలువరించారన్నారు.

ఫైనాన్స్ యజమాని ఆత్మహత్య



మల్లేశం (ఫైల్)

హుస్నాబాద్: పట్టణంలోని రవితేజ ఫైనాన్స్ యజమాని కొమురవెల్లి మల్లేశం (62) ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్నేళ్లుగా ఫైనాన్స్‌తోపాటు చిట్‌ఫండ్స్ కూడా నడిపిస్తున్నాడు. కొద్దిరోజులుగా మానసికంగా ఇబ్బంది పడుతున్నాడు. అనారోగ్య కారణాలతో ఇబ్బంది పడుతున్నారు. మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ధనలక్ష్మి ఫిర్యాదు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ మహేష్ తెలిపారు.

రైస్‌మిల్‌పై విజిలెన్స్ అధికారుల దాడి

నర్సాపూర్‌రూరల్: మండలంలోని కాగజ్‌మద్దూర్‌లోని ఓ రైస్‌మిల్‌పై విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి, రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు నర్సాపూర్ ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు. ఈ దాడులు చేసిన సమయంలో రైస్‌మిల్‌లో రేషన్‌బియ్యం పట్టుబడినట్లు చెప్పారు.

జాతీయ రహదారిపై డీసీఎం దగ్ధం

రోడ్డు పక్కన నిలిపిన కారుకు సైతం అంటుకున్న మంటలు



మంటల్లో డీసీఎం



పూర్తిగా దగ్ధమైన డీసీఎం, కారు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని బీరంగూడ వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం ఓ డీసీఎం దగ్ధమైంది. ఆ మంటలు రోడ్డు పక్కన నిలిపిన కారుకు కూడా అంటుకొని అది కూడా పూర్తిగా దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామిక ప్రాంతం నుంచి డీసీఎం లోడ్ చేసుకొని బాలానగర్‌కు వెళుతున్నారు. బీరంగూడ కమాన్ సమీపంలోకి రాగానే డీసీఎం ఇంజిన్ నుంచి మంటలు వచ్చాయి. బండిని పక్కకు నిలిపి డ్రైవర్‌కు కిందకు దిగాడు. ఒక్కసారిగా మంటలు డీసీఎంకు అంటుకొని తగలబడింది. పక్కనే ఉన్న కారు సైతం అంటుకోవడంతో అది కూడా పూర్తిగా దగ్ధమైంది. సంఘటనస్థలికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేసింది. అక్కడే ఉన్న డీసీఎం డ్రైవర్ వినోద్ రాయ్ మాట్లాడుతూ పొంతనలేని సమాధానం చెప్పాడు. పాశ మైలారం నుంచి బాలానగర్ వెళుతున్నట్లు చెప్పాడు. అంతటితో అక్కడి నుంచి పరారయ్యాడు. డీసీఎంలోని డ్రమ్ముల్లో ఏముందన్న విషయం తెలియరాలేదు. కొందరు ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ ఉందని చెబుతుండగా, మరికొందరు కెమికల్ సంబంధించిన పదార్థాలు ఉండొచ్చని భావిస్తున్నారు. మంగళవారం రాత్రి వరకు డీసీఎంకు చెందిన వారు పోలీసులను ఆశ్రయించలేదు. దీంతో పలు అనుమానాలు వస్తున్నాయి. కాగా దగ్ధమైన కారు యాజమాని సికింద్రాబాద్ నివాసి గౌరీచరణ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన బంధువులను కలవడానికి బీరంగూడ వద్దకు వచ్చానని, కారు పక్కన నిలిపి బంధువుల ఇంటికి వెళ్లి వచ్చేలోపల కారు దగ్ధమైందన్నాడు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్

డీసీఎంలో మంటలు రావడంతో జాతీయ రహదారిపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ జామ్ అయ్యింది. పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

కొడుకులున్నా.. కూడు లేదని

- ఆకలికి అలమటిస్తున్న ఓ వృద్ధ తల్లి
- దీనస్థితిని చూసి డయల్ 100కు కాల్ చేసిన స్థానికులు



రోడ్డుపై ఒంటరిగా సత్తెవ్వ

హుస్నాబాద్: రెక్కలు ముక్కలు చేసుకొని ముగ్గురు కొడుకులను పెంచిపెద్దచేసింది. ఆస్తులూ సంపాదించింది. వయసు పైబడిన దశలో ఆ వృద్ధ తల్లి ఆకలికి అలమటిస్తోంది. నెలకో కొడుకు ఇంట్లో ఉంటున్నా, ఎవరూ సరిగ్గా పట్టించుకోవడం లేదని వాపోయింది. ఆమె దీనస్థితిని నుంచి స్థానికులు పోలీసులకు కాల్ చేశారు. వివరాల్లోకి వెడితే...హుస్నాబాద్‌కు చెందిన కవ్వ సత్తెవ్వకు ముగ్గురు కుమారులు ఉన్నారు. ఆరపల్లెలో 12 ఎకరాలు, మరో చోట 12 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ఆస్తిని ముగ్గురికి సమంగా పంచింది. వంతులవారీగా ఒక్కో నెల కొడుకుల వద్దే ఉండే విధంగా పెద్ద మనుషుల్లో మాట్లాడారు. అయితే భూముల పంపకాలకు సంబంధించి అన్నదమ్ముల మధ్య గొడవ జరుగుతోంది. కేసుల దాకా వెళ్లారు. తల్లికి లక్ష రూపాయలు తీసి ఓ అడ్వకేట్ వద్ద ఉంచారు. అయితే నెలకు వచ్చే రెండు వేల మిత్తి ఆమె ఖర్చులకు సరిపోవడం లేదు. ఆరపల్లెలో ఉన్న నాలుగు గుంటల జాగాలో చిన్న ఇల్లైనా కట్టిస్తే అక్కడ ఉంటానని, కొడుకుల వద్ద ఉంటే అన్నం సరిగ్గా పెట్టకుండా గెంటేస్తున్నారని వాపోయింది. 78 ఏళ్ల వయసులో ఎక్కడ ఉండాలే... ఎక్కడ తినాలే అంటూ సత్తెవ్వ కన్నీరుమున్నీరుగా విలపించడంతో స్థానికులు చలించిపోయారు. వెంటనే 100 నంబరుకు కాల్ చేశారు. ఈ ఘటనపై ఎస్‌ఐ మహేష్ మాట్లాడుతూ డయల్ 100కు కాల్ వచ్చింది వాస్తవమేనన్నారు. కొడుకులను స్టేషన్‌ను రావాలని తన సిబ్బందితో సమాచారం పంపించానన్నారు. అయితే బాధితురాలి నుంచి ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

అమ్మా.. కాంగ్రెస్ అండగా ఉంటుంది

ఫోన్‌లో ఖదీర్ భార్యను పరామర్శించిన రేవంత్‌రెడ్డి



ఖదీర్ భార్యతో ఫోన్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

మెదక్ జోన్: అమ్మా మీకు న్యాయం జరిగే వరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, ఖదీర్ భార్య సిద్దేశ్వరితో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రేవంత్ రెడ్డి ఫోన్‌లో ఖదీర్ భార్యతో ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. మీకుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. ఖదీర్ విషయమై రాష్ట్ర డీజీపీతో మాట్లాడినట్లు చెప్పారు. న్యాయం జరగకుంటే కాంగ్రెస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామన్నారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్న సమయంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ మ్యాడం బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

అదృశ్యమై... ఆపై వాగులో శవమై



నర్సింహులు (ఫైల్)

చిన్నశంకరంపేట(మెదక్): అదృశ్యమైన ఓ వ్యక్తి వాగులో శవమై తేలాడు. గ్రామస్తుల కథనం ప్రకారం .. మండల పరిధిలోని జంగరాయికి చెందిన కమ్మరి నర్సింహులు(51 ఒంటరిగా స్వగ్రామంలో ఉంటుడగా, కుటుంబసభ్యులు హైదరాబాద్‌లో ఉంటున్నారు. మూడురోజులుగా నర్సింహులు కనిపించలేదని స్థానికులు చెప్పారు. మంగళవారం వాగులో శవమై తేలగా, స్థానికులు పోలీసులు సమాచారం ఇచ్చారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య సంగవ్వ, కూతురు ఉన్నారు.

ఏసీబీకి చిక్కిన కౌడిపల్లి ధరణి ఆపరేటర్



కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్న నగదు

- భూ రిజిస్ట్రేషన్ చేసేందుకు లంచం డిమాండ్
- రైతు ఫిర్యాదుతో పట్టుకున్న ఏసీబీ అధికారులు
- ఇద్దరిపై కేసు నమోదు



కౌడిపల్లిలో వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్‌పీ ఆనంద్‌కుమార్ పక్కన ఇన్‌స్పెక్టర్లు

కౌడిపల్లి(నర్సాపూర్): పది గుంటల వ్యవసాయ భూమి రిజిస్ట్రేషన్ కోసం లంచం డిమాండ్ చేయగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. ఈ సంఘటన కౌడిపల్లి తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఏసీబీ డీఎస్పీ ఆనంద్‌కుమార్ , ఇన్‌స్పెక్టర్ వెంకటరాజాగౌడ్, రమేశ్‌తో కలిసి మంగళవారం రాత్రి వివరాలు వెల్లడించారు. కౌడిపల్లి మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రైతు నీరుడి పోచయ్య అదేగ్రామానికి చెందిన పానుగంటి సత్తమ్మ నుంచి 20 గుంటల భూమిని కొనుగోలుకు అగ్రిమెంట్ చేసుకున్నాడు. అందులో నుంచి 10 గుంటల భూమిని ఇతరులకు అమ్మివేశాడు. మిగతా 10 గుంటల భూమిని తనపేరును రిజిస్ట్రేషన్ కోసం గత నెల 25వ తేదీన తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి ఆపరేటర్ వేణురెడ్డిని కలిశాడు. కాగా రిజిస్ట్రేషన్ కోసం రూ.20 వేలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేశాడు. దీంతో అదేరోజు రైతు ఏసీబీ అధికారులను సంప్రదించాడు. మంగళవారం రిజిస్ట్రేషన్ కోసం స్లాట్ బుక్‌చేసుకోగా లంచం డబ్బు తెచ్చినట్లు చెప్పడంతో రిజిస్ట్రేషన్ పూర్తి చేశాడు. రిజిస్ట్రేషన్ అనంతరం డబ్బులు రూ.20 వేలు కౌడిపల్లి మండలం లింగంపల్లితండాకు చెందిన కేతావత్ రాజుకు ఇవ్వమని వేణురెడ్డి చెప్పడంతో తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో డబ్బులు ఇచ్చాడు. దీంతో ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ధరణి ఆపరేటర్ వేణురెడ్డి, మధ్యవర్తి రాజుపై కేసునమోదు చేశారు. లంచం విషయమై వీరితోపాటు తహసీల్దార్ కార్యాలయంలో ఇంకా ఎవరి ప్రమేయం ఉందన్న విషయం విచారణ చేస్తున్నారు. వేణురెడ్డి స్వగ్రామం కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండలం నందివాడ గ్రామం . అతడి ఇంటిలో సోదాలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

దుబ్బాకరూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామం వద్ద సోమవారం రాత్రి కారు చెట్టుకు ఢీకొట్టడంతో పలువురికి గాయాలయ్యాయి. తొగుట మండలం వర్దరాజ్‌పల్లి గ్రామానికి చెందిన కనకయ్య, బాల్‌రాజ్, రవీందర్, చంద్రయ్య కారులో సిద్దిపేట నుంచి వారి గ్రామానికి వెళ్తున్న క్రమంలో చెట్టుకు ఢీ కొట్టారు. స్వల్ప గాయాలు కావడంతో 108లో సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు.

బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని..

మండలంలోని ధర్మాజీపేటకు చెందిన ఇద్దరు బైక్‌పై సిద్దిపేట నుంచి వారి గ్రామానికి వెళ్తున్నారు. మరొక వ్యక్తి అప్పనపల్లి వైపు వెళ్తున్న క్రమంలో ఎదురెదురుగా బైక్‌లు ఢీకొట్టాయి. సాయికృప తలకు గాయాలు కావడంతో 108లో దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మనోవేదనతో మృతి చెందాడని..

- వృద్ధుడి మృతదేహంతో బంధువుల ఆందోళన
- భూ రిజిస్ట్రేషన్ వ్యవహారమే కారణం



జీకురు బాలయ్య (ఫైల్)

మిరుదొడ్డి(దుబ్బాక): అనారోగ్యంతో వృద్ధుడు మృతి చెందిన సంఘటన తీవ్ర ఉత్కంఠకు దారి తీసింది. ఆయనకు చెందిన భూమితో పాటు ఇంటి స్థలాన్ని అక్రమంగా ఒకరు రిజిస్ట్రేషన్ చేసుకోవడంతోనే మనోవేదన కారణంగా మృతి చెందాడని ఆరోపిస్తూ మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. అంతేకాకుండా రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తి ఇంట్లో మృతదేహాన్ని ఉంచారు. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి మృతుడి బంధువులకు నచ్చ జెప్పడంతో ఆందోళన విరమించి మృతదేహాన్ని తీసుకెళ్లారు. సోమవారం రాత్రి జరిగిన సంఘటనకు సంబంధించి మృతుడి బంధువులు, గ్రామస్తులు తెలిపిన కథనం ప్రకారం వివరాల ప్రకారం.. మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన జీకురు బాలయ్యకు సంతానం లేదు. మేనల్లుడు బాలనర్సయ్యను దత్తత తీసుకున్నాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. తనకున్న 38 గుంటల వ్యవసాయ భూమితో పాటు ఇంటి స్థలాన్ని అదే గ్రామానికి చెందిన శేఖర్‌కు ఏడాది క్రితం బాలయ్య రిజిస్ట్రేషన్ చేయించాడు. అయితే తన మేనమామ అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడంటూ మేనల్లుడు బాలనర్సయ్య కోర్టు నుంచి స్టే ఆర్డర్ తెచ్చుకున్నాడు. కులపెద్దల సమక్షంలో భూమి, ఇల్లు విషయంపై పంచాయితీ పెట్టారు. బాలయ్యకు అనుకూలంగా పెద్దలు తీర్మానం చేసినా కార్యరూపం దాల్చలేదు. దీంతో బాలనర్సయ్య బతుకుదెరువు నిమిత్తంవలస వెళ్లాడు. ఇటీవల బాలయ్య తీవ్ర అస్వస్థతకు లోనై మంచానపడ్డాడు. లేక ఆరోగ్యం మరింత క్షీణించి సోమవారం రాత్రి బాలయ్య తుది శ్వాస వదిలాడు. శేఖర్ కారణంగానే ఇలా జరిగిందంటూ మృతుడి బంధువులు ఆందోళన చేయగా, మిరుదొడ్డి ఎస్‌ఐ శ్రీధర్ గౌడ్ పరిస్థితిని చక్కదిద్దారు.

పోలీసు విధులను ఆటంకపరిచిన వ్యక్తికి జైలు

సిద్దిపేటకమాన్: పట్టణంలోని ముస్తాబాద్ చౌరస్తా వద్ద బహిరంగ ప్రదేశంలో న్యూసెన్స్ చేసిన వ్యక్తికి న్యాయమూర్తి జైలు శిక్ష విధించారు. మంగళవారం సిద్దిపేట వన్‌టౌన్ సీఐ భిక్షపతి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట రూరల్ మండలం చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన గద్దల కుమారస్వామి సోమవారం సాయంత్రం ముస్తాబాద్ చౌరస్తాలో విద్యుత్ స్తంభం ఎక్కి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని వారించడానికి వెళ్లిన పోలీసు సిబ్బందిని దుర్భాషలాడుతూ విధులను అడ్డుకున్నాడు. కుమారస్వామి గతంలోకూడా ఇదేవిధంగా చేశాడని, దీంతో అతడిని సిద్దిపేట వన్ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకుని సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ రమేశ్‌బాబు ఎదుట హాజరుపరిచారు. విచారణ చేసిన న్యాయమూర్తి కుమారస్వామికి 12 రోజుల జైలు శిక్ష విధించారు. పోలీసుల విధులను అడ్డుకునేలా, ప్రజలకు ఇబ్బంది కలిగేలా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరు ప్రవర్తించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీఐ భిక్షపతి హెచ్చరించారు.



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

ఊర కుక్కల దాడి

35 గొర్రెలు మృతి, 15 గొర్రెలకు గాయాలు

హత్నూర(సంగారెడ్డి): ఊర కుక్కల దాడిలో 35 గొర్రెలు మృతి చెందాయి. 15 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో నాలుగు గొర్రెలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నాయి. ఈ సంఘటన హత్నూర మండలం చందాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన పాపనోళ్ల ఎల్లయ్య గొర్రెలను ఎప్పటిలాగే మేతకు తీసుకెళ్లి సోమవారం రాత్రి ఇంటి పక్కన గల కొట్టంలో ఉంచాడు. ఊరకుక్కలు అర్ధరాత్రి గొర్రెల కోటపై దాడి చేసి 35 గొర్రెలను చంపేశాయి. మరో 15 గొర్రె పిల్లలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో నాలుగు గొర్రెల పరిస్థితి విషమంగా ఉందని బాధితుడు ఎల్లయ్య బోరున విలపించాడు. సుమారు రూ.3లక్షల వరకు నష్టం వాటిల్లందని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆర్‌ఐ శ్రీనివాస్ సంఘటన స్థలాన్ని పరిశీలించి జరిగిన విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని బాధితునికి హామీ ఇచ్చామన్నారు.

కేన్సర్‌తో విద్యార్థిని మృతి



స్వాతి(ఫైల్)

పాపన్నపేట(మెదక్): పదిహేనేళ్ల ప్రాయంలోనే ఓ విద్యార్థిని కేన్సర్‌తో మృతి చెందింది. మండల పరిధిలోని కొంపల్లికి చెందిన దయ్యాపు స్వాతి (15) మండల పరిధిలోని చీకోడ్ -లింగాయపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. కొంతకాలంగా బోన్ కేన్సర్‌తో బాధపడుతూ ఆదివారం మృతి చెందింది. బిడ్డ మరణంతో తల్లిదండ్రులు మల్లేష్ దంపతులు కన్నీరు మున్నీరయ్యారు. పాఠశాల హెచ్‌ఎం సుశీల, టీచర్లు, తోటి విద్యార్థులు నివాళులు అర్పించారు.

బైండోవర్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

తొగుట(దుబ్బాక): బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని గజ్వేల్ ఏసీపీ రమేశ్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొగుట మండలం ఎల్లారెడ్డిపేటకు చెందిన మన్నె భాగయ్య(49) బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించడంతో రూ.50వేల జరిమానా విధించినట్టు తెలిపారు. అతని సత్ప్రవర్తనపై 17-6-2022న తొగుట ఎస్‌ఐ కర్ణాకర్‌రెడ్డి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారన్నారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించి నేరం చేసినట్టు పోలీస్ స్టేషన్‌లో తహసీల్దార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. తహసీల్దార్ విచారణ జరిపి భాగయ్య నిబంధనలను ఉల్లంఘించినట్టు తెలిపారు. దీంతో అతనికి రూ.50వేల జరిమానా విధించనట్టు ఏసీపీ తెలిపారు. బైండోవర్ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఏసీపీ హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కోహెడరూరల్(హుస్నాబాద్): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని ఆరేపల్లి శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పొట్టి సుధాకర్(30) మండలంలోని నాగసముద్రాల సబ్‌స్టేషన్‌లో పని చేస్తూ బస్వాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం రాత్రి 12 గంటలకు పని ముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో ఆరేపల్లి శివారులో డబుల్ రోడ్డు నిర్మాణం కోసం తీసిన గుంతలో పడటంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులు పోలీసులకు తెలిపారు.

బస్సు ఢీ: యువకుడికి గాయాలు



గాయపడిన భాస్కర్

మనోహరాబాద్(తూప్రాన్): బస్సు ఢీకొనడంతో యువకుడికి గాయాల య్యాయి. ఈ సంఘటన మంగళవారం మండలంలోని కాళ్లకల్ గ్రామం జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బ్యాంకు పనిపై వెళ్లిన కుమ్మరి భాస్కర్ తిరిగి ఇంటికి స్కూటీపై వస్తున్నాడు. ఈ క్రమంలో నిజామాబాద్ నుంచి తిరుపతి వెళ్తున్న గరుడ బస్సు ఢీ కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే క్షతగాత్రుడిని స్థానికులు 108 అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



పాదయాత్రగా వెళ్తున్న సీఐటీయూ నాయకులు

కొండపాక(గజ్వేల్): గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ రాష్ట్ర నాయకత్వం చేపట్టిన పాదయాత్రకు సంఘీభావంగా మంగళవారం సీఐటీయూ నాయకులు పాదయాత్ర చేశారు. మండల పరిధిలోని వెలికట్ట గ్రామం నుంచి దుద్దెడ వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమవుతుందన్నారు. జీవో 51ని సవరిస్తూ మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు బర్మ కొమురయ్య, జాలిగామ ప్రభాకర్, పల్లె శ్రీనివాస్, లచ్చవ్వ, మల్లవ్వ, రాజు, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

మహ్మదాపూర్‌లో హరితహారం చెట్ల తొలగింపు



మహ్మదాపూర్‌లో చెట్లను తొలగించిన దృశ్యం

హుస్నాబాద్‌రూరల్: చెట్లను పెంచాలని ప్రభుత్వం హరితహారంలో భాగంగా మొక్కలను నాటిస్తే ప్రజాప్రతినిధులు పంతాలకు వెళ్లి హరితహారంలో నాటి 500 చెట్లను తొలగించిన సంఘటన హుస్నాబాద్ మండలం మహ్మదాపూర్‌లో చోటు చేసుకుంది. లింగాల బండ కింద హరితహారంలో భాగంగా 1000 మొక్కల వరకు కూలీలతో నాటించారు. వీటి సంరక్షణకు అధికారులు చర్యలు తీసుకుంటూ ఎండిన చెట్ల స్థానంలో కొత్త మొక్కలను నాటిస్తున్నారు. గ్రామస్తుల ఆమోదం లేకుండానే అక్కడ ఆలయం నిర్మించాలనే ఒక ప్రజాప్రతినిధి వర్గం హరితహారంలో నాటిన 500 మొక్కలను తొలగించింది. ప్రజల అభిప్రాయం మేరకు అభివృద్ధి చేయాల్సిన ప్రజాప్రతినిధులు ఎవరికీ చెప్పకుండానే చెట్లను తొలగించడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. మంగళవారం బీజేపీ నాయకులు చెట్లు తొలగించిన ప్రదేశాన్ని పరిశీలించి మండల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదన్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, తొలగించిన మొక్కలను నాటించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి బద్దిపడిగ జయపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌లు డిమాండ్ చేస్తున్నారు.